క్లుప్తంగా

ఎంఎస్ఆర్ సేవలు కొనసాగిస్తాం



ఎంఎస్ఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న షర్మిలారెడ్డి తదితరులు

సీటీఆర్ఐ: దివంగత మేడపాటి సీతారామరెడ్డి సేవలను కొనసాగిస్తామని ఏపీ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి అన్నారు. శనివారం సీతారామరెడ్డి జయంతి సందర్భంగా ఎంఎస్ఆర్ హైటెక్ బస్టాండ్ వద్ద ఆయన విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ, సీతారామరెడ్డి రాజమహేంద్రవరంలో అనేక దాతృత్వ కార్యక్రమాలు చేపట్టారన్నారు. టీటీడీ కల్యాణ మండపం, ఎంఎస్ఆర్ హైటెక్ బస్టాండ్, సుబ్రహ్మణ్య మైదానంలో ఆడిటోరియం, క్వారీ మార్కెట్ వద్ద శివాలయం తదితర నిర్మాణాలు ఆయన ఆధ్వర్యంలో జరిగాయన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ఆర్ ఫాలోవర్స్, ఎంఎస్ఆర్ ఆటో స్టాండ్ సభ్యులు, ఆయన కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

9న శ్రీకరి వార్షికోత్సవం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): శ్రీకరి లలితా మండలి 44వ వార్షికోత్సవం ఈ నెల 9న నిర్వహించనున్నట్టు వ్యవస్థాపకురాలు గ్రంధి విజయలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టి.నగర్‌లోని శ్రీచక్ర సహిత బాలాత్రిపుర సుందరి, అన్నపూర్ణ, కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో 9న సాయంత్రం 4 నుంచి వార్షికోత్సవాలు ప్రారంభమవుతాయని చెప్పారు. సామూహిక విష్ణు, లలితా సహస్ర పారాయణలు, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు.

ట్రంప్ విధానాలతో తీవ్ర సంక్షోభం

ప్రకాశం నగర్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధానాలతో భారత్‌లో వ్యవసాయ, ఆక్వా రంగం తీవ్ర సంక్షోభంలోకి వెళ్లే ప్రమాదం ఉందని, ట్రంప్ విధించిన 50 శాతం సుంకాలను రద్దు చేయాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక శ్యామలా సెంటర్‌లో ట్రంప్, ప్రధాని మోదీకి వ్యతిరేకంగా సీపీఐ, సీపీఎం, సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ పార్టీల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ అమెరికా సామ్రాజవాద విధానాలు భారత ప్రయోజనాలను దెబ్బతీసేలా ఉన్నాయని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో వామపక్ష నాయకులు తాటిపాక మధు, టి.అరుణ్, చీకట్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా తేజోమూర్తుల

సీటీఆర్ఐ: రాజమహేంద్రవరానికి చెందిన తేజోమూర్తుల నరసింహమూర్తి రాష్ట్ర బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ, తన సేవలను గుర్తించి పదవిని అందించినందుకు సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. తనకున్న అవకాశం మేరకు ప్రభుత్వ పెద్దల సహకారంతో బ్రాహ్మణ సంక్షేమం కోసం కృషి చేస్తానని తెలిపారు.

కంటి పరీక్షలు తప్పనిసరి

కంబాలచెరువు: కంటిలో దృష్టి దోషాల నివారణకు నేత్ర పరీక్షలు చేయించుకోవాలని జిల్లా నేత్ర వైద్యాధికారి డాక్టర్ బి.శ్రీనివాసరావు సూచించారు. నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా శనివారం స్థానిక దానవాయిపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అంధత్వ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ నెల 8న విద్యా సంస్థలలో విద్యార్థులకు కంటి పరీక్షలను చేస్తామన్నారు. హెచ్ఎం ఎస్.రవికుమార్, జిల్లా నేత్ర విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

కంబాలచెరువు: సంపూర్ణ పోషక విలువలు కలిగిన ఆహారం భుజిస్తేనే పూర్తి ఆరోగ్యం చేకూరుతుందని, పిల్లల్లో ఎదుగుదల బాగుంటుందని అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్‌కుమార్ అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం మ్యాజిక్ బస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పౌష్టికాహార దినోత్సవం జరిగింది.

ఉపసంహరించుకోవాలి

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్ శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం తీసుకున్న వైద్య కళాశాలల పీపీపీ విధాన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. దీనివల్ల వందలాది మంది ప్రతిభగల విద్యార్థులకు ఎంబీబీఎస్ విద్య దూరమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైద్య కళాశాలలను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారన్నారు.

పర్యావరణానికి 'నానో' మేలు

రాజమహేంద్రవరం రూరల్: రైతులు రసాయన ఎరువులపై ఆధారపడకుండా పర్యావరణానికి మేలు చేసే బయో, నానో ఎరువులను వినియోగించాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు అన్నారు. శనివారం తొర్రేడులో నానో, బయో ఎరువుల ప్రదర్శన, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నానో యూరియా ప్రయోజనాలపై జిల్లావ్యాప్తంగా రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఏపీసీఎస్ఎఫ్ డీపీఎం తాతారావు, రాజమహేంద్రవరం ఏడీఏ శ్రీనివాసరెడ్డి, మండల వ్యవసాయాధికారి భీమరాజు, సొసైటీ అధ్యక్షుడు దండమూడి బాపినీడు, సీఈవో సత్యనారాయణ పాల్గొన్నారు.

కడియం: నానో యూరియా, నానో డీఏపీల ప్రయోజనాలను రైతులు గుర్తించాలని ఎంఏవో కె.సూర్యరమేష్ అన్నారు. స్థానిక సహకార సొసైటీలో త్రిసభ్య కమిటీ అధ్యక్షుడు రఘురామ్ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు.



వాటర్ వర్క్స్ ర్యాంప్ వద్దకు చేరిన గణేశ విగ్రహాలు



చెరువులో నిమజ్జనానికి విగ్రహాన్ని తరలిస్తున్న భక్తులు



నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న పోలీసు అధికారులు



పంటుపై నుంచి విగ్రహాన్ని గోదావరిలో నిమజ్జనం చేస్తున్న సిబ్బంది

గోదారమ్మ ఒడికి.. గణేశుడు చేరి..

- వైభవంగా వినాయకుడి శోభాయాత్ర
- అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసుల బందోబస్తు
- ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు

సీటీఆర్ఐ: నగరంలో వినాయక చవితి ఉత్సవాలకు తెరపడింది. శనివారం వినాయక విగ్రహాలను నిమజ్జనానికి ఊరేగింపుగా తీసుకువెళ్లి గోదారమ్మ ఒడిలో నిమజ్జనం చేశారు. భారీ విగ్రహాల నుంచి చిట్టి వినాయక విగ్రాహాల వరకు భారీఎత్తున నిమజ్జనాలు జరిగాయి. గోదావరి గట్టున ఉన్న హెడ్ వాటర్ వర్క్స్ ఇసుక ర్యాంప్ వద్ద నిమజ్జనాలకు నగరపాలక సంస్థ, ట్రాఫిక్ పోలీసు విభాగాలు పూర్తి ఏర్పాట్లు చేశారు. గణేశ్ నిమజ్జనానికి వీలుగా పెద్ద పంటును, భారీ క్రేన్‌ను ఏర్పాటు చేశారు.

4 వేలకు పైగా నిమజ్జనాలు

శనివారం ఒక్కరోజు సుమారు నాలుగు వేలకు పైగా చిన్న, పెద్ద విగ్రహాలను నిమజ్జనం చేశారు. రాజమహేంద్రవరం నగర పరిధిలోనే కాకుండా, రాజమహేంద్రవరం రూరల్ నుంచి కూడా ఇక్కడికి విగ్రహాలను తీసుకొచ్చి నిమజ్జనం చేశారు. విగ్రహ నిమజ్జనానికి వచ్చిన వారిని గట్టుపైనే నిలిపివేసి, వారి విగ్రహాన్ని సిబ్బంది తీసుకుని గోదావరిలో నిమజ్జనం చేశారు. భక్తులు కూడా పంటు ఎక్కితే బరువుకు గల్లంతయ్యే అవకాశాలు ఉండడంతో ఈ చర్యలు చేపట్టినట్టు అధికారులు తెలిపారు. క్రమ శిక్షణతో విగ్రహాలను నిమజ్జనం చేయాలని, ట్రాఫిక్‌కు, ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులు పదేపదే విజ్ఞప్తి చేయడం కనిపించింది.



గోదారమ్మ ఒడిలో వినాయకుడు

పోలీసు, ట్రాఫిక్, నగరపాలక సంస్థ అధికారులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. వైద్య సిబ్బంది, అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచారు. విద్యుత్ సౌకర్యం కల్పించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందుస్తుగా నగరంలో పోలీసు, ట్రాఫిక్ నియంత్రణ చేశారు. శనివారంతో పాటు, ఆదివారం కూడా అధిక సంఖ్యలో నిమజ్జనానికి విగ్రహాలు రానున్న నేపథ్యంలో పోలీసు, ట్రాఫిక్, అగ్నిమాపక సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు.

కడియం: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక నిమజ్జనాలు ఉత్సాహంగా సాగాయి. ఆదివారం చంద్ర గ్రహణం ఉండడంతో శనివారమే నిమజ్జనాలు చేయాలని ఉత్సవ కమిటీలు నిర్ణయించాయి. ఈ నేపథ్యంలో మండల కేంద్రమైన కడియంతో పాటు, వేమగిరి, కడియంపులంక, దుళ్ల, వీరవరం, మురమండ తదితర గ్రామాల్లోని ఉత్సవ విగ్రహాలు జలనివాసాలకు తరలాయి. కడియం, మాధవరాయుడుపాలెం, జేగురుపాడు, కడియపు సావరం గ్రామాల్లోని విగ్రహాలను కాకినాడ కాలువలో నిమజ్జనం చేశారు. అలాగే వేమగిరి, కడియపులంక, బుర్రిలంక, వెంకాయమ్మపేట, పొట్టిలంక, వీరవరం తదితర గ్రామాల్లోని విగ్రహాలను కోటిపల్లి కాలువకు తరలించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కడియపులంకలో ముసలమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ఉత్సవ గణపతి ఊరేగింపులో పెద్దఎత్తున మహిళలు పాల్గొన్నారు. కాగా ఉత్సవ అనుమతులు మొదలు నిమజ్జనాల వరకు విస్తృత పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎ.వేంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్సైలు దుర్గాప్రసాద్, ప్రసన్న తమ సిబ్బందితో ఊరేగింపులను పర్యవేక్షిస్తూ, ఉత్సవ కమిటీలకు సూచనలు చేశారు.



కడియపులంకలో వినాయక నిమజ్జనానికి తరలివెళుతున్న మహిళలు

బై బై గణేశా..!

రాజమహేంద్రవరం రూరల్: మండలంలోను, నగరపాలక సంస్థలోని ఎనిమిది డివిజన్లలో శనివారం వినాయక నిమజ్జన వేడుకలు ఘనంగా జరిగాయి. రాజవోలు, బొమ్మూరు, హుకుంపేట, పిడింగొయ్యి, శాటిలైట్‌సిటీ, కొంతమూరు, కాతేరు, వెంకటనగరం, తొర్రేడు గ్రామాల్లో వినాయక విగ్రహాలను భారీ ఊరేగింపుతో, డప్పు వాయిద్యాలు, నృత్యాలతో సందడి చేశారు. విగ్రహాలను గ్రామాల్లోని చెరువుల్లోను, నగరానికి దగ్గరగా ఉన్న గోదావరిలో నిమజ్జనాలు చేశారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రామపాదాల రేవులో..

ధవళేశ్వరం: గోదారమ్మ ఒడికి గణనాథుడు చేరాడు. శనివారం రాత్రి సుమారు వంద విగ్రహాలను రామపాదాల రేవులో నిమజ్జనం చేశారు. రథంవీధి, అంకాలమ్మ గుడి సెంటర్, కంచర్ల లైన్ తదితర ప్రాంతాల్లో గణపతి విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ భవ్యకిషోర్, సీఐలు టి.గణేష్, కె మంగాదేవి బందోబస్తు నిర్వహించారు.



బొమ్మూరు బృందావనకాలనీలో గణేశ్ విగ్రహాలతో మహిళలు



రాజవోలులో వినాయకుడిని ఊరేగింపు



రామపాదాల రేవులో నిమజ్జనం చేసేందుకు తీసుకువస్తున్న గణనాథుడి విగ్రహం



నిమజ్జనానికి ఊరేగింపుగా వస్తున్న గణనాథుడు

గ్రామాభివృద్ధికి శంభాజీరావు విశేష కృషి

వైఎస్సార్ సీపీ యువజన విభాగ రాష్ట్ర నాయకుడు గణేష్

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు గ్రామాభివృద్ధికి మాజీ సర్పంచ్ మద్దిపోటి శంభాజీరావు చేసిన సేవలు మరువలేనివని, ఆయన చేసిన ప్రతి అభివృద్ధి పనులు చిరస్థాయిగా నిలిచిపోతాయని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు జక్కంపూడి గణేష్ కొనియాడారు. శనివారం బొమ్మూరు గ్రామంలోని మద్దిపోటి శంభాజీరావు సంతాప సభలో ఆయనతో పాటు, మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు, ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులరెడ్డి, మాజీ సర్పంచ్ మత్సేటి ప్రసాద్, వివిధ పార్టీల నాయకులు, ప్రముఖులు పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.



శంభాజీరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జక్కంపూడి గణేష్ తదితరులు

శంభాజీరావు కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. వేలాది సంఖ్యలో శంభాజీరావు అభిమానులు హాజరై, ఆయన చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు.

జీఎస్టీతో ప్రజల నడ్డి విరిచిన ఎన్డీఏ

రాజమహేంద్రవరం సిటీ: కేంద్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తొమ్మిదేళ్లుగా జీఎస్టీ పేరిట 28 శాతం శ్లాబ్‌తో సామాన్య, మధ్య తరగతి ప్రజల నడ్డివిరిచిందని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ ఆరోపించారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఇన్నాళ్లకు కూటమి ప్రభుత్వానికి ప్రజలు గుర్తొచ్చారని, అందుకే జీఎస్టీ శ్లాబ్‌ను 12 నుంచి ఐదు శాతం వరకు కుదించారని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో బీజేపీ చేస్తున్న అక్రమాలను లోక్‌సభలో కాంగ్రెస్ పక్షనేత రాహుల్‌గాంధీ బయట పెట్టడంతో, దాని నుంచి ప్రజల దృష్టి మరల్చడానికి జీఎస్టీని తెరపైకి తెచ్చారని విమర్శించారు. ఇలాగైనా సామాన్యులకు కాస్త ఉపశమనం కలిగిందంటూ కేంద్ర ఆర్థిక మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో జరిగే స్థానిక ఎన్నికలను ధీటుగా ఎదుర్కొనేందుకు త్వరలో నగర కమిటీతో పాటు, డివిజన్ కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. పార్టీ నాయకులు ఎస్.మార్టిన్‌లూథర్, బోడ వెంకట్, కొవ్వూరి శ్రీనివాస్, చామర్తి లీలావతి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు శాఖకు కైరా, రాడో జాగిలాలు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జిల్లా పోలీసు కార్యాలయానికి కై రా, రాడో రెండు నూతన జాగిలాలు వచ్చాయి. ఈ సందర్భంగా వాటిని ఎస్పీ డి.నరసింహకిశోర్ శనివారం పరిశీలించారు. మంగళగిరి పోలీసు హెడ్ క్వార్టర్స్ నుంచి ఈ జాగిలాలు వచ్చాయని ఎస్పీ తెలిపారు. కేసుల ఛేదనలో కీలకమైన జాగిలాల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డాగ్ స్క్వాడ్‌కు సూచించారు. జిల్లా పోలీస్ శాఖలోకి కొత్త జాగిలాల చేరికతో దర్యాప్తు మరింత శక్తివంతం అవుతుందని చెప్పారు. రాడో జాగిలం శిక్షణ కాలంలో రాష్ట్ర స్థాయిలో మూడో స్థానం సాధించడం గర్వకారణమన్నారు. నేరస్తులను పట్టుకోవడంలో మాత్రమే కాక ఎక్స్‌పో గుర్తించడంలో కైరా అత్యుత్తమ ప్రతిభ కలిగి ఉందన్నారు. నార్కోటిక్స్‌ను గుర్తించడంలో రాడో అత్యుత్తమ ప్రతిభ కలిగి ఉందన్నారు. శిక్షణ పొందిన డాగ్ హ్యాండ్లర్స్‌కు సర్టిఫికెట్లు అందజేశారు. ఏఆర్ డీఎస్పీ రవికుమార్, ఆర్ఐ కోటేశ్వరకుమార్, డాగ్ హ్యాండ్లర్స్ డి.సతీష్, ఓ.దేవుడురాజు, కె.శివకుమార్, ఎస్.అయ్యప్ప పాల్గొన్నారు.



జాగిలాలను పరిశీలిస్తున్న ఎస్పీ నరసింహకిశోర్

యోగా గురువు శ్రీధర్‌రెడ్డికి పురస్కారం

రాజమహేంద్రవరం సిటీ: యోగాలో విశిష్ట సేవలకు గుర్తింపుగా బెంగళూరులో జరిగిన జాతీయ కార్యక్రమంలో జీవిత సాఫల్య పురస్కారం అందుకున్నట్టు యోగా గురువు కేఎస్‌వీ శ్రీధర్‌రెడ్డి శనివారం ఇక్కడ తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో రాయల్ బెంగళూరు గ్లోబల్ యోగ ఆర్గనైజేషన్, రాయల్ క్లబ్ ఆఫ్ బెంగళూరు కల్యాణ్, యోగా యూనివర్సిటీ ఆఫ్ అమెరికన్స్ సంయుక్తంగా ఈ పురస్కారం అందజేసినట్టు తెలిపారు.



పురస్కారం అందుకున్న శ్రీధర్‌రెడ్డి (ఎడమ నుంచి తొలి వ్యక్తి)

ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి



మంగరాణిని సన్మానిస్తున్న డాక్టర్ రామారెడ్డి



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న లయన్స్ ప్రతినిధులు



సుసత్యరేఖ దంపతులను సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

కంబాలచెరువు: ఉపాధ్యాయుడు మారుతున్న బోధన పద్ధతులకు అనుగుణంగా మారాలని, ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి అని ప్రముఖ మానసిక వైద్యుడు డాక్టర్ కర్రి రామారెడ్డి అన్నారు. నగరానికి చెందిన ఉపాధ్యాయిని మోటూరి మంగారాణి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న సందర్భంగా శనివారం స్థానిక మానస హాస్పిటల్‌లో ఆమెను అభినందించారు. బోధనలో ఆధునిక టెక్నాలజీని వినియోగిస్తూ, విద్యార్థులకు సులభంగా పాఠాలు అర్థమయ్యేలా వీడియోలు రూపొందిస్తున్న మంగారాణి స్ఫూర్తిదాయకం కావాలన్నారు. అవార్డు అందుకున్న మంగారాణిని డీఈవో కంది వాసుదేవరావు తన కార్యాలయంలో అభినందించారు. కార్యక్రమంలో అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమ సమాజ నిర్మాతలు

ఉపాధ్యాయులు సమ సమాజ నిర్మాతలని సత్య సాయి గురుకులం ప్రిన్సిపాల్ కూచిపూడి గురయ్య అన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ రాజమండ్రి గోదావరి ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ భవన్‌లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథి గురయ్య మాట్లాడుతూ, ఉపాధ్యాయులు విద్యార్థుల భవిత నిర్దేశకులని, నేటి బాలల భవిత చిత్రాలను మార్చగలిగేది ఉపాధ్యాయుడేనన్నారు. ఉపాధ్యాయుడు పిల్లలకు ఆదర్శనీయంగా ఉండాలన్నారు. లయన్స్ జోన్–2 చైర్మన్ కె.ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ, ఏటా ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయులను ప్రోత్సాహకరంగా సన్మానిస్తున్నామన్నారు. ఉపాధ్యాయులు పరస జగన్నాథరావు, మద్దుల శ్యామలాదేవి, కందుకూరి బాలసుబ్రహ్మణ్యం, బెల్లపు విజయలక్ష్మిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు నరసింహ మూర్తి, నాగేంద్ర, కేవీవీ ఆదినారాయణ, ప్రముఖ రచయిత నూజిళ్ల శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో..

స్థానిక ప్రభుత్వ అటానమస్ కళాశాలలో గురుపూజోత్సవం సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉత్తమ అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. కళాశాలకు చెందిన తొమ్మిది మంది అధ్యాపకులను ఎమ్మెల్యే శ్రీనివాస్ అవార్డులు అందజేసినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్కే తెలిపారు. కార్యక్రమంలో అకడమిక్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎ.రాజేశ్వరి, అకడమిక్ సెల్ సభ్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

సీటీఆర్ఐ: జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా సుసత్యరేఖ ఎంపిక కావడం హర్షణీయమని జవహర్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఉండవల్లి సత్యనారాయణ అన్నారు. స్థానిక వేంకటేశ్వర నగర్‌లో క్లబ్ ఆధ్వర్యంలో నగరానికి చెందిన సుసత్యరేఖను ఘనంగా సత్కరించారు. తమ వృత్తుల్లో రాణిస్తున్న నిపుణులను క్లబ్ తరపున సన్మానిస్తున్నామని సత్యనారాయణ చెప్పారు. ఆమె చేసిన పరిశోధనలతో, విద్యార్థుల్లో సైన్స్‌పై మక్కువ పెంచటానికి విశేష కృషి చేశారని మాస్టర్ సత్యనారాయణ రాజు, భానుప్రసాద్ కొనియాడారు.

సచివాలయ సిబ్బంది చురుగ్గా పనిచేయాలి

అదనపు కమిషనర్ రామలింగేశ్వర్

రాజమహేంద్రవరం సిటీ: ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వార్డు సచివాలయ సిబ్బంది సమర్థంగా పనిచేయాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ అన్నారు. శనివారం 42వ వార్డు సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడారు. పురమిత్ర యాప్ ప్రజల్లో విస్తృతం చేయాలన్నారు. సచివాలయ పరిధిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ఇంకా 40 శాతం జరగలేదని, వీలైనంత త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. నిరుద్యోగులకు అవసరమైన నైపుణ్య శిక్షణను అందించి ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేందుకు కౌశలం సర్వేలో ఎక్కువ మంది నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. సచివాలయానికి వచ్చే సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కార దిశగా కృషి చేయాలన్నారు.



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న రామలింగేశ్వర్

ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు

కంబాలచెరువు: హెచ్ఐవీ నియంత్రణలో పురోగతి సాధించినప్పటికీ వ్యాధి ఇంకా పూర్తిగా నిర్మూలించబడలేదని ఎయిడ్స్ కంట్రోల్ ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్.పువనేశ్వరన్ అన్నారు. స్థానిక జూనియర్ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులకు హెచ్ఐవీపై అవగాహన సదస్సు శనివారం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వీఎల్ నరసింహం అధ్యక్షత వహించారు. పువనేశ్వరన్ మాట్లాడుతూ సమాజంలో హెచ్ఐవీ ఉందని గుర్తుంచుకోవాలన్నారు. మాదక ద్రవ్యాల అలవాటు, లైంగిక చర్యల్లో కండోమ్ వాడకపోవడం ఎయిడ్స్ వ్యాప్తికి కారణాలన్నారు. భావితరాలు హెచ్ఐవీ బారిన పడకుండా రక్షించుకోవాలంటే ఈ వ్యాధిపై అవగాహన పెంచుకోవాలన్నారు.